



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా



ఉరకలేసిన ఉత్సాహం..

ఆటపాటలతో కనుల పండువగా బాలోత్సవం

రెండు రోజుల పాటు వెల్లివిరిసిన సృజనాత్మకత

జానపద, శాస్త్రీయ తదితర నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న బాలబాలికలు





ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్/క్రైం

కర్నూలు నగర శివార్లలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల వేదికగా రెండు రోజులపాటు సాగిన పిల్లల పండుగ 4వ కర్నూలు బాలోత్సవంలో విద్యార్థుల్లో ఉత్సాహం ఉరకలేసింది. రెండు రోజులపాటు బాలోత్సవం కన్నుల పండుగగా సాగి శుక్రవారం ఘనంగా ముగిసింది. విద్యార్థులు తమ నైపుణ్యాలను చక్కగా ప్రదర్శించి అబ్బురపరిచారు. విద్యార్థుల సృజనాత్మకత వెల్లి విరిసింది. రెండో రోజు 27 అంశాల్లో పోటీలను నిర్వహించారు. మొత్తం మూడు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండో రోజు జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం, కోలాటం నిర్వహించారు. మధ్యాహ్నం బాలోత్సవం అధ్యక్షులు బడే సాహెబ్ అధ్యక్షతన ముగింపు సభ నిర్వహించారు. తొలుత ఢీ టైటిల్ విన్నర్ హేమంత్ తన నృత్య ప్రదర్శనతో అలరించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. డీఈవో శామ్యూల్ పాల్ మాట్లాడుతూ ఇంతమంది విద్యార్థులు బాలోత్సవంలో పాల్గొనడం జిల్లా విద్యాశాఖకే గర్వకారణమన్నారు. ఇది అన్ని కార్యక్రమాల కంటే పెద్ద కార్యక్రమమని తెలిపారు. పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. పిల్లల్లోని సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథాన్ని బయటకు తీయడానికి ఈ కార్యక్రమం దోహద పడుతుందన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ బి.శంకర్ శర్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బాలోత్సవంలో పాల్గొనే విద్యార్థుల సంఖ్య, పోటీల అంశాల సంఖ్య పెరుగు తోందన్నారు. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలనే మంచి సదుద్దేశం బాలోత్సవం వెనక ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రమాద కరమైన సెల్‌ఫోన్ నుంచి పిల్లలు దూరంగా ఉండేందుకు సహాయపడతా యన్నారు. ఎండో క్రైనాలజిస్ట్ డాక్టర్ భరత్ మాట్లాడుతూ బాలోత్సవం చూస్తూ చూస్తూనే పెద్ద ఈవెంట్‌గా మారిందన్నారు. పిల్లల్లో చిన్నప్పటి నుంచి సృజనాత్మకత పెంచేందుకు ఈ కార్యక్రమం సహాయపడుతుందన్నారు. బాలోత్సవం మరిన్ని సంవత్సరాలు విజయ వంతంగా జరగాలని ఆకాంక్షించారు. ఏపీఎస్పీ బెటాలియన్ డిఎస్పి మహబూబ్ బాషా మాట్లాడుతూ బాలోత్సవంలో పాల్గొనేందుకు పిల్లలు చాలా తపన పడుతున్నారని, అంతే బాగా ప్రదర్శనలు ఇస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ముత్యాలను కూడా బయటకు తీయడానికి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ రాష్ట్ర నాయకులు రామరాజు, మాంటిస్సోరి విద్యాసంస్థల సీఈవో విల్సన్, ప్రిన్సిపల్ మీనాక్షి విల్సన్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, కర్నూలు బాలోత్సవం కన్వీనర్ ధనుంజయ, ప్రధాన కార్యదర్శి జెఎన్ శేషయ్య, ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎస్ఎం జయరాజు, జిల్లా అధ్యక్షులు యు.ఆర్.ఏ రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు బిడి సుధీర్ రాజు, బాలోత్సవ్ కమిటీ సభ్యులు హేమంత్, ఎల్లా గౌడ్, సాయి ఉదయ్, నగేష్, చంద్రమోహన్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న డిఇఒ శ్యామూల్ పాల్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ తదితరులు



ముగింపు వేడుకలో మాట్లాడుతున్న ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ భరత్

రైల్వే ప్రాజెక్ట్‌ల భూ సేకరణను పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రైల్వే ప్రాజెక్ట్‌ల నిర్మాణాలకు సంబంధించిన భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే ఓవర్ బ్రిడ్జి తదితర రైల్వే ప్రాజెక్ట్ నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆదోని వద్ద నిర్మించనున్న లెవెల్ క్రాసింగ్, కౌతాళం, ఆదోని మండలాలలోని ఎరిగేరి, కుప్పగల్ గ్రామాల్లో నిర్మించనున్న లెవెల్ క్రాసింగ్ పనులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దకడబూరు మండలంలోని గవిగట్టు గ్రామంలో నిర్మించనున్న లెవెల్ క్రాసింగ్, కోసిగి మండలం ఇరంగల్ గ్రామం వద్ద లెవెల్ క్రాసింగ్, కడితోట గ్రామం వద్ద లెవెల్ క్రాసింగ్, సాకిబండ గ్రామం వద్ద లెవెల్ క్రాసింగ్, లక్ష్మీపురం గ్రామం సమీపంలో నిర్మించనున్న లెవెల్ క్రాసింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆదోని డివిజన్‌కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న లెవెల్ క్రాసింగ్ గేట్స్ ప్రాజెక్ట్స్ 201, 207లను మే నాటికి పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒ సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఆర్అండ్‌బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గణితంపై విద్యార్థులకు మక్కువ పెంచాలి

- డిఇఒ ఎస్.శామ్యూల్ పాల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులకు గణితంపైన మక్కువ పెంచేందుకు బలమైన పునాది వేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ అన్నారు. శుక్రవారం కర్నూల్ నగర శివారులలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి సందర్శించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసన మెరుగవ్వాలంటే కచ్చితంగా బోధన అభ్యసన సామాగ్రిని వినియోగించాలని డిఇఒ సూచించారు. ఉపాధ్యాయులు ఒకరి అనుభవాలు ఒకరితో పంచుకోవడానికి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలపై సానుకూల ధోరణి కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ దావీదు, కెఆర్‌పిలు, డిఆర్‌పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి

- తుగ్గలిలో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - తుగ్గలి



తుగ్గలి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

ప్రజలపై భారాలు మోపే విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే నిలిపివేయాలని సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, ప్రజలపై విద్యుత్ భారాలు వేయవద్దని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం తుగ్గలిలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుగ్గలిలో చిన్న వెల్డింగ్ షాప్‌కు స్మార్ట్ మీటర్ బిగించిన తర్వాత రూ.41,650 విద్యుత్ బిల్లు రావడం దుర్మార్గమన్నారు. షాప్ నిర్వాహకుడు కృష్ణ కష్టపడిన అంత ఆదాయం రాదన్నారు. రైతులు, కార్మికులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ పెడుతున్నారని తెలిపారు. అలాగే నివాస గృహాలకు మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం కొనసాగిస్తున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని, స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పి అదానీ, షిర్డీ సాయి సంస్థలతో కుమ్మక్కయి, వేలాది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని విమర్శించారు. ప్రతి మీటరుకు అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వేలాది రూపాయలను వినియోగదారుల నుండే వసూలు చేస్తారని, మరోవైపు విద్యుత్ అధికంగా వినియోగించే రాత్రి వేళల్లో అధిక రేట్లు వసూలు చేయనున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు, హమాలీ యూనియన్ నాయకులు ఈశ్వరప్ప, ప్రజలు కృష్ణ, ముత్యాలయ్య, హనుమంతు, శీను, రంగప్ప రాజు, బొగ్గుల నగేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వహించాలి

- సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలోని పలు విభాగాలను సందర్శించి సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పలు ఒపి విభాగాలైన, మెడికల్, ఆర్థో, చిన్న పిల్లల ఒపి, గైనిక్, సూపర్ స్పెషాలిటీ ఒపి, ఎంసిహెచ్, గైనిక్, డైట్, పెయిన్ బ్లాక్ తదితర విభాగాల్లో రౌండ్స్ నిర్వహించినట్లు తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో వాటర్ లీకేజ్ మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని హెల్త్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయకుండా చూసుకోవాలని సెక్యూరిటీనీ ఆదేశించారు. ఫార్మసీ మాడ్యూల్‌లోని ఈ హాస్పిటల్ అప్లోడింగ్ ప్రాసెస్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఫార్మసీ సిబ్బందిని ఆదేశించారు. రోగులకు ఇస్తున్న భోజనాన్ని పరిశీలించారు. రోగులకు సంబంధించిన మెను గురించి ఆరా తీశారు. రోగులకు రుచికరమైన భోజనం అందించాలని డైట్ సిబ్బందిని ఆదేశించారు. గైనిక్ విభాగం దగ్గర ఉన్న వ్యర్థాలను తొలగించి పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆస్పత్రిలోని పెయిన్ బ్లాక్‌లో ఉన్న డీలక్స్ రూములు త్వరలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వర రావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ కిరణ్ కుమార్, న్యూ డయాగ్నోస్టిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఆస్పత్రి ఎడి మల్లీశ్వరి, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి బాయి పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి

- ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు కమతం పరశురాం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వైసిపి నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు కమతం పరశురామ్ తెలిపారు. శుక్రవారం వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ.మోహన్ రెడ్డిని, కెడిసిసి బ్యాంక్ మాజీ ఛైర్మన్ విజయ మనోహరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ... కర్నూలు నగరంలో 'అన్నా' అని పిలిస్తే పలికే ఏకైక నాయకుడు ఎస్వీ.మోహన్ రెడ్డి అని తెలిపారు. సాధారణ కార్యకర్తలమైన తమను నాయకులుగా తీర్చిదిద్దారని చెప్పారు. మోహన్ రెడ్డి మాట్లాడుతూ.... అట్టడుగు వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించిన ఏకైక నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని చెప్పారు. కాశపోగు ఏసు, నాగపురి వనష్, చోటు, యోగి, చిన్న, అంజి పాల్గొన్నారు.

కెవిఆర్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలులోని కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఓమ్ని హాస్పిటల్, ఓక్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి డాక్టర్ శిశిర, ఎమ్‌డి డాక్టర్ సుధారమణి, గైనకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి, డెంటిస్ట్ వారు విచ్చేసి విద్యార్థినులకు, కళాశాల అధ్యాపకులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ రంగారెడ్డి, అధ్యాపకులు ఆరతి చక్రా, డాక్టర్ ఎంవిఎన్‌వి.ప్రసాద్ గుప్తా పాల్గొన్నారు.

బెల్లంగుడి గుంతకు మోక్షం..!

- 35 ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం

- సర్పంచి జయన్న కృషిపై హర్షం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామంలోని పోలీసు కాలనీలో గత 35 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న బెల్లంగుడి గుంతకు మోక్షం లభించింది. గతంలో ఎంతోమంది అధికారులు, సర్పంచులు మారినా సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచింది. బి.తాండ్రపాడు దినదినాభివృద్ధి చెందుతూ కొత్త కొత్త భవనాలు చుట్టుపక్కల వెలిశాయి. బెల్లంగుడి గుంత సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. దాదాపు 12 అడుగుల లోతు గుంతలో నీరు చేరి, జమ్ము, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. పురుగు, పుట్రా చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు దోమలు విపరీతంగా పెరిగి మలేరియా విష జ్వరాలకు దారి తీసేది. ఈ నేపథ్యంలో స్థానికులు సమస్యను గుర్తించిన సర్పంచి ఆకెపోగు జయన్న దృష్టికి ప్రజలు తీసుకురావడంతో 2001 నుంచి దశలవారీగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన సర్పంచిగా కొనసాగుతుండడంతో సమస్యకు పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టారు. మొదట గుంతను పూడ్చే దిశగా అడుగులు వేశారు. గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భారీ ఎత్తున గ్రావెల్ మట్టిని తరలించి గుంతను పూడ్చేందుకు పూనుకున్నారు. స్థానికులు జయన్న కృషి పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే సిసి రోడ్డు నిర్మాణానికి కూడా తీర్మానం చేసి ప్రభుత్వ అనుమతులు కూడా పొందినట్లు తెలిసింది. ఈ పనులను సైతం వేగంగా పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామంలోని మంగళగిరిలో, బీసీ కాలనీలో, ఎస్సీ కాలనీలో అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేలా పలుచోట్ల సిసి రోడ్లు నిర్మించారు.

గ్రామాభివృద్ధి లక్ష్యం : సర్పంచి జయన్న




టిడిపి సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ఆ ఘనత గ్రామానికి దక్కింది. గ్రామంలో ప్రజలకు అవసరమైన సేవలను అందించడమే నా లక్ష్యం. ప్రజలకు నిత్యం అండగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేస్తాం.

పంట నమోదు వివరాల తనిఖీ

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలంలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది, విఆర్‌ఒలు నమోదు చేస్తున్న పంట వివరాలను శుక్రవారం జెసి డాక్టర్ బి.నవ్య క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. సూదేపల్లి గ్రామంలోని రైతు గొల్ల వెంకటేశ్వర్లు సాగు చేసిన ఉల్లి, వేరుశనగ పంటలను పరిశీలించి రైతుతో సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్.వరలక్ష్మి, జిల్లా ఉద్యానవన అధికారి రామాంజనేయులు, వెల్దుర్తి తహశీల్దార్ చంద్ర శేఖర వర్మ, డిప్యూటీ తహశీల్దార్, సర్వేయర్, ఉద్యానవన అధికారి నరేష్ రెడ్డి, ఎఒ అక్బర్ బాషా, కలాం, విఆర్‌ఒ మద్దిలేటి, ఎంపిఇఒ రమాదేవి పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న జెసి నవ్య



రాంభూపాల్ రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షులు

శివాలయం ప్రారంభోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్టాపన


ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో శివాలయం, ధ్వజస్తంభ ప్రతిష్టాపనను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్నూలు కార్పొరేషన్ 28వ వార్డు కార్పొరేటర్ ఇప్పల నారాయణరెడ్డి, వైసిపి గ్రామ నాయకులు మస్తాన్, చాంద్ బాషా, ఈశ్వరయ్య, ఆలయ నిర్మాణ అధ్యక్షులు బాలాజీ, శివ పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థుల స్కూల్ హెల్త్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

నగరంలోని గాయత్రి ఎస్టేట్స్‌లో ఉన్న గీతాంజలి నర్సింగ్ కళాశాల 3వ సంవత్సరం బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు తమ పాఠ్యాంశంలో భాగంగా శుక్రవారం నగరంలోని బిక్యాంపులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు స్కూల్ హెల్త్ ప్రోగ్రాం నిర్వహించారు. అక్కడి విద్యార్థులకు వారి ఆరోగ్య భద్రత విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు బిపి, షుగర్, థైరాయిడ్, ఇతర పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ వసంత కుమారి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు సురేఖ, నిర్మల పాల్గొన్నారు.



కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

మార్కెట్‌లో పని చేసే కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని మార్కెట్ యార్డ్ యూనియన్ల గౌరవాధ్యక్షులు టి.రాముడు, సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్.సాయి బాబా కోరారు. శుక్రవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో 184 మంది లోడింగ్, అన్ లోడింగ్ కార్మికులకు రెండు జతల యూనిఫారం జెడి సి.రామాంజనేయులు, ఎడిఎం నారాయణమూర్తి, మార్కెట్ యార్డ్ ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్.జయలక్ష్మి, రాముడు, సాయిబాబా సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని జెడిని కోరారు. ఆయన స్పందిస్తూ... డిమాండ్‌ను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సిఐటియు మార్కెట్ యార్డ్ యూనియన్ల నాయకులు బీసన్న, రామకృష్ణ, కోదండ రాముడు, మధు, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీకృష్ణ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వినికిడి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్



నగరంలోని గౌరీ గోపాల్ హాస్పిటల్ దగ్గర వుడ్ ల్యాండ్ కాంపౌండ్‌లో ఉన్న శ్రీకృష్ణ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ 19వ వార్షికోత్సవం సందర్భంగా సిగ్నియా కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం చెవుడు, మాటలు రాని వారికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ అధినేత బి.శివకృష్ణ మాట్లాడారు. ఈ పరీక్షలు మామూలు రోజుల్లో చేయించుకోవాలంటే రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు అవుతుందని తెలిపారు. వైద్య శిబిరంలో ఉచితంగా చేసినట్లు చెప్పారు. చాలామందికి చెవుడంటే ఎలా ఏ పరీక్షలు చేయించుకోవాలో చాలామందికి తెలియదని, వినికిడికి కావాల్సిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శబ్ధాలు ఉన్న ప్రదేశంలో ఇయర్ ప్లగ్స్ వాడడం చాలా మంచిదని, డిజె సౌండ్లు, బాణసంచా పేల్చే ప్రదేశాల్లో ఉండకపోవడం మంచిదని తెలిపారు. చెవుల్లో చీము కారుతుంటే చెవిలో నూనె పోసుకోకుండా వెంటనే ఇఎన్‌టి వైద్యుని సంప్రదించాలని సూచించారు. చిన్నపిల్లలకు వినపడకపోయినా, మాటలు రాకపోయినా, ఆడియోలోజిస్ట్, స్పీచ్ థెరపిస్ట్‌ను కలవాలని తెలిపారు. జర్మనీ టెక్నాలజీ గల సిగ్నియా కంపెనీ వినికిడి డిజిటల్ మిషన్లు సిగ్నియా కంపెనీ ఆడియోలజిస్ట్ ఎస్.సతీష్, ఆర్ఎస్ఎం ప్రవీణ్ రెడ్డి, ఎఎస్ఎం మహేశ్వర్ రెడ్డి తరఫున బ్లూటూత్, రీఛార్జిబుల్ హియరింగ్ 30 శాతం భారీ డిస్కౌంట్‌తో లభిస్తున్నట్లు చెప్పారు. ఫోన్‌లో మాట్లాడటానికి ఇబ్బంది పడుతున్న వారు, టివిలో మాటలు వినపడక ఇబ్బంది పడుతున్న వారికి, చిన్న, చిన్న శబ్ధాలు వినపడకపోయినా హియరింగ్ వల్ల స్పష్టంగా వినిపిస్తాయని తెలిపారు. కొత్త టెక్నాలజీ వినికిడి మిషన్లు కనిపించకుండా అమర్చబడునని చెప్పారు. ఈ ఉచిత వినికిడి వైద్య శిబిరాన్ని ఈ నెల 10 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు.

రమణీయం.. వీరభద్రస్వామి రథోత్సవం

ప్రజాశక్తి - పత్తికొండ

మండలంలోని హోసూరు గ్రామంలో వెలసిన భద్రకాళి వీరభద్ర స్వామి రథోత్సవం శుక్రవారం రమణీయం సాగింది. హోసూరు మాజీ సర్పంచి వాకిటి శారదమ్మ, టిడిపి నాయకులు బానగని రాజశేఖర్, రాహుల్, ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. ముందుగా భద్రకాళి వీరభద్ర స్వామిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భద్రకాళి వీరభద్ర స్వామి మహా రథోత్సవానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి రథాన్ని ముందుకు లాగారు. మహారథం ముందుకు సాగుతుండగా నందికోల నృత్యాలు, కోలాటాలు, ప్రత్యేక నృత్యాలు, వేషధారణలు, బొమ్మల ప్రదర్శనలు మంగళవాయిధ్యాలు, బీరప్పడోళ్లు, తప్పెట్లతో మహారథానికి స్వాగతం పలికారు. బత్తిన వెంకట్రాముడు, సాంబశివారెడ్డి, తుగ్గలి నాగేంద్ర, టిడిపి నాయకులు ఆంజనేయులు, నాగేంద్ర, భాస్కర్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఆస్పరి


సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు మండి పడ్డారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అందించే విత్తనాలు, ఎరువు సబ్సిడీలో కూడా అన్యాయం జరిగిందని తెలిపారు. రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని విమర్శించారు. బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి కేవలం రూ.86 వేల కోట్లు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. రూ.2 లక్షల వేల కోట్లు ఉపాధి హామీ చట్టానికి కేటాయించి ఉపాధి కూలీలను ఆదుకోవాలని కోరారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని తెలిపారు. కార్మిక వర్గానికి ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్‌ల ముఖ్య ఉద్దేశమని చెప్పారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈనెల 14 నుంచి 20 వరకు నిరసనలు చేపడుతున్నట్లు, రైతులు, ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, రజక సంఘం మండల కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు.

మిరప పంటలో తెగుళ్లపై అవగాహన

ప్రజాశక్తి - గోనెగండ్ల


పరిశీలిస్తున్న ధనుకా సిబ్బంది

మండలంలోని వీరం పల్లి గ్రామ రైతు క్షేత్రంలో మిరప పంటను ఆశించే తెగుళ్లు, చీడపీడలపై రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం ధనుకా కంపెనీ జనరల్ మేనేజర్ హుస్సేన్ వలీ మాట్లాడారు. రైతులు సుధాకర్, శీను కు చెందిన ధనుకా డెమో మిరప క్షేత్రాన్ని జపాన్‌కు చెందిన కంట్రీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సజల్ బిశ్వాస్, బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఫుజిత సాన్ హాజరై పరిశీలించారన్నారు. మిరప పంటను ఆశించే బూడిద తెగులుతో పాటు ప్రస్తుత వాతావరణ మార్పులో మిరపను ఆశించే కొత్త రకం వైరస్‌లపై రైతులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ముందస్తుగా సరయిన మందులను వాడడం వల్ల పంటను కాపాడుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. ధనుకా డిజిఎంలు లోకేష్ రెడ్డి, పరశురామయ్య, ఏరియా మేనేజర్ మోహన్ రెడ్డి, డాక్టర్ ముబీనా, ఎస్ఎంఇ సుభోత్ గుప్తా, సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ వీరంపల్లి పాల్గొన్నారు.

పశు సంపదతో ఆర్థిక అభివృద్ధి

- పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్లు వెంకటరమణ, రాజశేఖర్

ప్రజాశక్తి - కౌతాళం


ప్రదర్శనకు హాజరైన అధికారులు

పశు సంపదతో పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్లు వెంకటరమణ, రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బాపురం గ్రామంలో లేగదూడల ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా హాజరయి మాట్లాడారు. రైతులకు వ్యవసాయ రంగంతో పాటు పశు సంపద ఎంతో తోడ్పడుతుందన్నారు. పశు సంపద అభివృద్ధి చెందాలంటే పశు వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. పశువుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేపడుతున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దూడల పెంపకం, యాజమాన్యం, సంరక్షణ, నట్టల నివారణ, కృత్రిమ గర్భధారణ గురించి వివరించి, అవగాహన కల్పించారు. రైతులకు మందులు, మినరల్ మిక్సర్, కాల్షియం టానిక్‌లు, బహుమతులు పంపిణీ చేశారు. పశువైద్యాధికారులు జగదీష్ బాబు, మహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. సిద్ధేశ్వర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని హాల్వి గ్రామంలో వెలసిన శ్రీసిద్ధేశ్వర స్వామి రథోత్సవం కనుల పండువగా సాగింది. శుక్రవారం హాల్వి పీఠాధిపతులు శ్రీమహంతేశ్వర స్వామి విగ్రహమూర్తులకు పూజలు చేశారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో దేవాలయంలో దర్శనం కోసం పూజల కోసం బారులు తీరారు. రథోత్సవానికి నదీచాగి, కుమ్మాలనూరు, కాత్రికి, పొదలకుంట, గుడికంబాళి, మురళి, వల్లూరు, చూడి తదితర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. రథోత్సవం వైభవంగా సాగింది. ఈ ఉత్సవాల్లో టిడిపి సీనియర్ నాయకులు, ఉల్లిగయ్య, రామకృష్ణారెడ్డి, చిన్న సిద్ధయ్య, సతీష్ నాయుడు, పట్టాభి, హనుమంతు, జనసేన పార్టీ ఆదోని ఇన్‌ఛార్జీ మల్లప్ప, వైసిపి నాయకులు బసవ ప్రభు, సిద్ధు, సిద్ధన గౌడ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా 'టౌన్ బ్యాంకు' ప్రమాణ స్వీకారం

- చిరు వ్యాపారులకు రుణాలు అందించాలి - ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పద్మశ్రీ మాచాని సోమప్ప నెలకొల్పిన ఎమ్మిగనూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం శుక్రవారం ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. టౌన్ బ్యాంకు ఛైర్మన్‌గా ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, వైస్ ఛైర్మన్‌గా బండా నరసప్ప, డైరెక్టర్లుగా మహబూబ్ బాషా, రవికుమార్, వాల్మీకి రాజు, వెంకటేశ్వర రెడ్డి, నరసింహులు, నవీన్ కుమార్, షాలం, వెంకటగిరి, భీమేష్‌లు ఎమ్మెల్యే బీవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ... ఎంతో గొప్ప ఆలోచనతో పద్మశ్రీ మాచాని సోమప్ప నెలకొల్పిన టౌన్ బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. అనుభవం, యువతరం, సామాజిక కోణంలో నూతన టౌన్ బ్యాంకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 2014-19లో ఛైర్మన్‌గా ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి ఎన్‌పిఎను 11 శాతానికి తీసుకొచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలో 11 శాతం ఉన్న ఎన్‌పిఎను 14 శాతానికి తీసుకొచ్చారని చెప్పారు. చిరు వ్యాపారులకు, చేనేత కార్మికులకు రుణాలిచ్చి పాలకవర్గం మంచి నిర్ణయాలతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. టౌన్ బ్యాంకు సేవలు పట్టణంలోనే కాకుండా వివిధ పల్లెలకు కూడా విస్తరింపజేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని కూటమి పాలనలో భాగంగా టౌన్ బ్యాంకు పాలకవర్గంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. టౌన్ బ్యాంకు వైస్ ఛైర్మన్ నర్సప్ప గుమస్తా కాదని, మూడో వార్డులో పార్టీ జనరల్ సెక్రటరీగా ఉన్నారని గుర్తు చేశారు. కొందరు గిట్టని వారు అసత్య ప్రచారాలు చేస్తారని, వారి ప్రచారాలు పట్టించుకోవద్దని తెలిపారు.


ఎమ్మెల్యే బీవీని సన్మానిస్తున్న నాయకులు


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఛైర్మన్, డైరెక్టర్

రజకులకు విరివిగా రుణాలివ్వాలి

- రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి

ప్రజాశక్తి - ఆదోని

చేతి వృత్తిని ఆధారంగా చేసుకొని జీవిస్తున్న రజకులకు విరివిగా రుణాలు మంజూరు చేసి ఆర్థిక బలోపేతానికి తోడ్పాటునందించాలని రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి కోరారు. శుక్రవారం విజయవాడ గొల్లపూడిలో గల బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మంత్రి సమక్షంలో కార్పొరేషన్ ఛైర్మన్ల సమీక్ష సమావేశానికి హాజరై రజక సమస్యలు, వారి జీవన విధానం గురించి వివరించినట్లు తెలిపారు. ప్రస్తుత దోబీ ఘాట్లు ఉన్న కొన్ని ప్రాంతాల్లో నీటి వసతి లేదన్నారు. కాలానికి అనుగుణంగా రజకులకు సౌకర్యంగా ఉండే ఆధునిక దోబీ ఘాట్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని వివరించారు. లాండ్రీల ఏర్పాటు దోబీ ఘాట్ల నిర్మాణం కోసం బ్యాంకులో రుణం మంజూరు చేయకపోవడంతో ఆర్థికపరమైన జీవితం మెరుగుపడడం లేదని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రజకులకు జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటుందించాలని కోరారు. గ్రామాల్లో వలసలు వెళ్లడం వల్ల రజకులు ఇబ్బందులు పడుతున్నారని, ఉన్న ఊళ్లోనే ఉపాధి కల్పన దిశగా కృషి చేయాలని తెలిపారు. ఆధునిక దోబీ ఘాట్లకు మోటార్ ఏర్పాటు చేసేందుకు రూ.10 లక్షలు అవుతుందని, గ్రూపుగా గుర్తించి రుణం ఇవ్వాలని కోరారు. గ్రూపుగా సానుకూలంగా మంత్రి స్పందించారని తెలిపారు. కార్పొరేషన్ జనరల్ మేనేజర్ భీమ్ శంకర్ ఉన్నారు.


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న సావిత్రి

ఇష్టంతో చదివి ప్రయోజకులు కావాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ప్రయోజకులు కావాలని ఎమ్మెల్యే పార్థసారథి సూచించారు. శుక్రవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సంజన్న అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హాజరై మాట్లాడారు. ఆడపిల్లలు ఇంటర్మీడియట్ చదివిన తర్వాత, అందరూ ఉన్నత చదువులు సొంత కాళ్లపై నిలబడాలని సూచించారు. తల్లిదండ్రులను, పెద్దలను, గురువులను గౌరవించాలని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సెండ్ ఆఫ్ తెలిపారు. సీనియర్ అధ్యాపకులు గోవిందరాజులు, అధ్యాపకులు ఎం.గోవిందరాజులు, జిపి.వేద వతి, చిట్టి ప్రసాద్, కాంతమ్మ, రాజేశ్వరి, ప్రభావతి, బడే సాబ్, శివయ్య, శాంతి స్వరూప్, ఈరన్న, శ్రీనివాసులు, సిబ్బంది శ్రీధర్, శ్రీనివాసులు, సాధిక్ బాష ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి


విచారణ చేపడుతున్న డీఎస్పీ

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్మశాన వాటిక విషయంలో చెలరేగిన వివాదంలో తమకు ప్రాణహాని ఉందంటూ తరగం ప్రసాద్‌తో కలిసి దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదయిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ ఉపేంద్ర బాబు శుక్రవారం విచారణ చేపట్టారు. మండలంలోని చెట్నిహల్లి గ్రామంలో శ్మశాన వాటిక పక్కనే తమ ఇళ్లు ఉన్నాయని, ఇక్కడ శ్మశాన వాటిక వద్దని దళితులు వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో గత వందేళ్ల నుంచి శ్మశాన వాటిక అక్కడే ఉందని బీసీ వర్గాల ప్రజలు తగాదా పడి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహశీల్దార్ ఎస్.రవి, సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజులు సర్వే నిర్వహించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. హరిజనులు ససేమిరా అంటూ జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సుమారు 50 మంది బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో డీఎస్పీ ఉపేంద్ర బాబు, విఆర్ఒ భీమయ్యతో ఇతర గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ శివాంజులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని వెంకటరమణ కాలనీ, అశోక్ నగర్, ఇందిరాగాంధీ నగర్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు.

ఎర్రబాడు చెరువులకు హంద్రీనీవా నీరు

- నీటి పేరుతో వసూళ్లకు పాల్పడితే చర్యలు - ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఎర్రబాడు గ్రామంలోని రెండు చెరువులకు శనివారం నుంచి నీటిని విడుదల చేయాలని హెచ్‌ఎన్ఎస్ఎస్ అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఐరన్ బండ, ఎర్రబాడు గ్రామాల్లో నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఎర్రబాడు గ్రామంలో హెచ్‌ఎన్ఎస్ఎస్ డిఇఇలు వరప్రసాద్, లక్ష్మీనాయక్, ఎఇ నజీర్‌తో ఆయన మాట్లాడారు. ఎర్రబాడు గ్రామంలోని రెండు చెరువులకు హంద్రీనీవా సుజల స్రవంతి నీటితో నింపాలని ఆదేశించారు. చెరువులకు నీటి విడుదలలో గ్రామంలో కొంతమంది వైసిపి నాయకులు వసూళ్లకు పాల్పడినట్లు తన దృష్టికి వచ్చిందని, నీటిని కూడా రాజకీయం చేయడం తగదని తెలిపారు. ఎవరైనా రైతుల నుంచి వసూళ్లకు పాల్పడినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎర్రబాడు శ్రీను, మౌలా, షేక్షావలీ, ముల్లా హుస్సేన్, ఏసు, ఐరన్ బండ నజీర్ సాహెబ్, భగవంతు రెడ్డి, ముల్లా బాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

గూడు కల్పించండి

- వికలాంగురాలు బోయ కేశమ్మ మొర

ప్రజాశక్తి - గోనెగండ్ల



తనకు గూడు కలించాలని మండలం లోని ఎర్రబాడు గ్రామానికి చెందిన బోయ కేశమ్మ కోరారు. మండలంలోని ఎర్రబాడు గ్రామానికి చెందిన బోయ మాదన్న, ఎంకమ్మ దంపతులకు ఆరుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు. వికలాంగురాలు బోయ కేశమ్మకు తప్ప మిగతా వారందరికీ పెళ్లిళ్ల అయిపోయాయి. గత కొన్నేళ్ల క్రితం వారి తండ్రి మరణించగా తల్లి ఎల్లమ్మతో కలిసి కేశమ్మ ఉంటున్నారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. ఎక్కువ మంది ఆడపిల్లలు ఉండడం వల్ల తమ సోదరులు తనను పట్టించుకోరని, తన తల్లి కూడా సుగ్గి (వలస) వెళ్లారని తెలిపారు. ప్రస్తుతానికి తాను గ్రామంలో ఎవరు భోజనం పెడితే వారి ఇంటి దగ్గర తిని ఉంటున్నానని పేర్కొన్నారు. తనకు పింఛను వస్తుందని, ట్రై సైకిల్ ఇచ్చినా, ఇవ్వకపోయినా ఎలాగైనా ఉండడానికి ఇంటి వసతి కల్పించాలని కోరారు. కనీసం చిన్న షెడ్డు లాంటిదైనా అధికారులు నిర్మించి ఇచ్చేలా చూడాలని వేడుకొన్నారు.

మాజీ వైస్ సర్పంచి ఎర్రిస్వామి మృతి

ప్రజాశక్తి - ఆస్పరి



మాజీ వైస్ సర్పంచి చాకలి ఎర్రిస్వామి (60) శుక్రవారం మృతి చెందారు. టిడిపి మాజీ ఎంపిపి వెంకటేష్ వివరాల మేరకు... మండలంలోని ఐనేకల్లు గ్రామానికి చెందిన చాకలి ఎర్రిస్వామి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. 2001లో వైస్ సర్పంచిగా గెలుపొంది గ్రామానికి ఎన్నో సేవలు అందించారు. మృతునికి భార్య అడివమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎర్రిస్వామి మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వెంకటేష్ తెలిపారు.

రుణాలు పారదర్శకంగా మంజూరు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

కార్పొరేషన్ రుణాల మంజూరులో అర్హులందరికీ ఆర్థిక ప్రయోజనం కలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బీసీ, ఓబీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం వందలాది మంది నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. స్వయం ఉపాధితో లబ్ధి పొందేందుకు యువత ముందుకు వస్తున్నారన్నారు. రాజకీయ నాయకుల జోక్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో నిరుద్యోగ యువత గత కొన్నేళ్లుగా ప్రభుత్వం నుంచి రుణాల మంజూరు కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. గతంలో పేరుకు మాత్రమే కార్పొరేషన్లు ఉండేవన్నారు. నిధులు లేకపోవడంతో గత ఐదేళ్లలో ఒక్క కార్పొరేషన్ ద్వారా యువతకు రుణాలు మంజూరు చేయలేదని విమర్శించారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో బీసీ, ఓబీసీలకు కార్పొరేషన్ ద్వారా బ్యాంకు అనుసంధానంగా రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానించడం మంచిదేనని తెలిపారు. బ్యాంకు రుణంతోనైనా స్థిరపడాలని ఇప్పటికే వేలల్లో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అధికారులు పారదర్శకంగా ఇంటర్వ్యూలు జరిపి అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. రాజకీయ జోక్యంతో అనర్హులకు ఇస్తే ఆందోళన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు.

సరి కొత్తగా హీరో డెస్టినీ 125

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్


హీరో డెస్టినీ 125 సరికొత్తగా అందుబాటులోకి వచ్చింది. ఐదు సూపర్ ఫీచర్స్‌తో మన ముందుకొచ్చింది. ఐకానిక్ రెట్రో డిజైన్, ఈల్యూమినేటెడ్ స్టార్ట్ స్విచ్, ఫుల్ ఎల్ఈడి ప్రొజెక్టర్ హెడ్ ల్యాంప్, బ్లూటూత్ తో సరికొత్త డిజిటల్ స్పీడోమీటర్, ఆటో క్యాన్సిల్ వింకర్స్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ప్రధాన కొనుగోలు ఫీచర్స్ వచ్చేసి స్టైల్, సేఫ్టీ, కంఫర్ట్, టెక్నాలజీ, ఎకనామితో అందరినీ ఆకట్టుకుంటోంది. మైలేజీలో, స్టయిల్‌లో, టెక్నాలజీలో మిగతా స్కూటర్ల కన్నా మెరుగ్గా తీర్చిదిద్దినట్లు సస్య మేనేజర్ తెలిపారు. ఈ వాహనాన్ని జనవరి 30న ఫోర్త్ టౌన్ సిఐ బి.మధుసూదన్ గౌడ్ చేతుల మీదుగా కర్నూలు సస్య షో రూమ్‌లో లాంచ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలకు ఎ8886112777 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.



ఎస్వీ లీగల్ అసోసియేట్స్ ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు లీగల్

కర్నూలు నగరంలోని మద్దూరు నగర్‌లో న్యాయవాదులు రెడ్డి వారి సత్య, ఎం.విక్టర్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్వీ లీగల్ అసోసియేట్స్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. తొలుత అర్చకులు పూజ నిర్వహించారు. అనంతరం ప్రముఖ న్యాయవాదులు ఈడిగ సురేంద్ర గౌడ్, శ్యాం సుందర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. న్యాయవాదులు రెడ్డి వారి సత్య, ఎం.విక్టర్ మాట్లాడుతూ... అన్ని రకాల న్యాయపరమైన సలహాలు, సూచనల కోసం తమను సంప్రదించవచ్చని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస్, న్యాయవాదులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు


అమ్మవారిని దర్శించుకుంటున్న తిక్కారెడ్డి

ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - కోసిగి

కోసిగిలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీవాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో గత ఐదు రోజుల నుంచి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని ప్రత్యేక అలంకరణలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. శుక్రవారం టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, విట్టా రమేష్, రాయచోటి రామయ్య కుటుంబ సభ్యులు, ఆయా గ్రామాల్లోని ఉన్న ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో గంగ, గోవు, గణపతి పూజలు చేశారు. చండీ పారాయణం, జపాలు, చండీ యాగం, ధాన్యాదివాసం, పుష్పాదివాసం, విగ్రహ ప్రాణ ప్రతిష్ట వంటి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధ్యక్షులు శ్రీనివాసులు శెట్టి, ఉపాధ్యక్షులు రమేష్ శెట్టి, ఇల్లూరు ఆదినారాయణ శెట్టి, ఇల్లూరు నాగేష్ శెట్టి, కొల్లి రామకృష్ణ, పార్థసారథి, ఇల్లూరు రామకృష్ణ శెట్టి, ఇల్లూరు భాస్కర్ శెట్టి, పెండ్యాల భరద్వాజ్ శెట్టి, రవితేజ శెట్టి, దినేష్ కుమార్ శెట్టి పాల్గొన్నారు.

ఎస్సీ, మైనార్టీ సెల్ ఛైర్మన్ల నియామకం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఛైర్మన్‌గా ఎన్‌సి.బజారన్న, జిల్లా మైనార్టీ డిపార్ట్‌మెంట్ ఛైర్మన్‌గా షేక్ ఖాజా హుస్సేన్ శుక్రవారం డిసిసి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. డిసిసి అధ్యక్షులు పి.మురళీకృష్ణ పాల్గొని వారికి నియామక పత్రాలను అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష, నియోజకవర్గ కోఆర్డినేటర్లు ఎం.ఖాసీం వలీ, జి.రమేష్ యాదవ్, మురళీకృష్ణ, రాజు, సీనియర్ మైనార్టీ నాయకులు అబ్దుల్ రహిమాన్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి

- పూర్తి చేయని సచివాలయ అధికారులపై ఎంపిడిఒ అసంతృప్తి

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలు మిస్సింగ్ సిటిజన్స్, హౌస్ హోల్డ్, జియో కోఆర్డినేటర్స్, ఎన్‌పిసిఐ లింకప్‌ను సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ అధికారులకు ఎంపిడిఒ అల్లా బకాష్ సూచించారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిప్పగిరి మండలం అస్పిరేషనల్ బ్లాక్ కింద ఎంపికైనందున ప్రతి సర్వేనూ అనుకున్న ప్రకారం పూర్తి చేయాలన్నారు. కొంతమంది సచివాలయ అధికారులు అలసత్వం వహించడం మంచిది కాదని, ఇలాగే కొనసాగితే వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఇంటికీ వ్యక్తిగత మురుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేని వారిని గుర్తించి వెంటనే నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయ అధికారులు నిర్దేశించిన సమయానికి కార్యాలయానికి చేరుకొని బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలన్నారు. హౌసింగ్ ఎఇ భవ్య, ప్రియ పాల్గొన్నారు.

12లోపు దరఖాస్తుకు అవకాశం

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని



సబ్సిడీ రుణాల కోసం ఈనెల 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. బీసీ, ఈబీసీ (కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ) కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల వారి నుంచి స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాలకు సబ్సిడీ మంజూరు చేసేందుకు గాను దరఖాస్తుదారులు చేసుకోవచ్చని తెలిపారు. ఎపిఒబిఎంఎంఎస్ ద్వారా వారి పేరును ఆన్‌లైన్‌లో ఈనెల 12 వరకు పొడిగించినట్లు చెప్పారు. బీసీ, ఈబీసీలకు 21 నుంచి 60 ఏళ్లు, కాపు, బలిజ, తెలగ, ఒంటరి వారికి 21 నుంచి 50 ఏళ్ల వరకు వయస్సు ఉండాలన్నారు. తెల్లరేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు కలిగి ఉండాలని తెలిపారు. ఒక కుటుంబం తెల్ల రేషన్ కార్డులో ఒకరు మాత్రమే లబ్ధి పొందేందుకు అర్హులని చెప్పారు.

ఉద్యోగులకు ఆటవిడుపు అవసరమే

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని


విధుల్లో భాగంగా మానసిక ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులకు క్రీడల వల్ల ఆటవిడుపు కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. మున్సిపల్ మైదానంలో శుక్రవారం ఫ్రెండ్‌షిప్ కప్ ఆల్ డిపార్ట్‌మెంట్ టోర్నమెంట్‌ను బ్యాటింగ్ చేసి క్రికెట్‌ను ప్రారంభించారు. తహశీల్దార్ శివరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ ఆర్గనైజర్ ముజీబ్ అహ్మద్ పూలమాల, శాలువాతో సన్మానించారు. కమిషనర్ మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో ప్రభుత్వ శాఖల్లోని 17 జట్ల మధ్య క్రికెట్ పోటీ ఉంటుందని తెలిపారు. వివాదాలకు తావివ్వకుండా స్నేహపూర్వకంగా ఆడాలని సూచించారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఉద్యోగుల జట్టు, మున్సిపల్ ఉద్యోగుల రెండో జట్టు గెలుపొందాయని ఆర్గనేజర్ ముజీబ్ అహ్మద్ తెలిపారు. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'ను మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ జనార్ధన్ కైవసం చేసుకున్నారు. మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ రామ్మూర్తి, ఆర్ఐ పెద్దయ్య ఉన్నారు.


మున్సిపల్ కమిషనర్ కృష్ణను సన్మానిస్తున్న నిర్వాహకులు

వివాహ వేడుకలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి


ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో జరిగిన ఓ వివాహ వేడుకలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. శుక్రవారం స్థానిక సిఎస్ఐ చర్చిలో నూతన వధూవరులు జీవమ్మ, ప్రవీణ్ వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయనకు, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, నాయకులు జనార్ధన్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారికి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. వైసిపి ఎస్సీ నాయకులు అబ్రహాం, కయ్యూన్, వరుని సోదరులు పేతూరు, వీరేష్, శివ, అంజి పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

టిడిపి మండల అధ్యక్షులు వెంకటేష్ స్వామి హాజరు

టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి హాజరయి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనకు పెళ్లి పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. వధూవరులు జీవమ్మ, ప్రవీణ్‌కు ఆశీస్సులు అందించారు. ఆయనకు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. టిడిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఏబు, హండే హనుమంతు, గణేకంటి రఘు, పేతూరు, సుందర్ రాజు, వీరేష్, ఈరన్న ఉన్నారు.


వేడుకల్లో పాల్గొన్న పన్నగ వెంకటేష్ స్వామి